



మచిలీపట్నంలో జ్యూయలరీ పార్క్ ప్రతినిధుల సంఘీభావ ర్యాలీ



ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బెజవాడలో ముస్లింల ర్యాలీ

భారత్ మాతాకీ జై

ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తూ, భారత సైన్య ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ జిల్లా అంతటా ప్రత్యేక కార్యక్రమాలు, ర్యాలీలు జరుగుతున్నాయి. దేశ సరిహద్దులో గురువారం నాటి పరిస్థితుల నేపథ్యంలో హిందువులతో పాటు ముస్లింలు సైతం ఒక్కటిగా కదిలి రోడ్డెక్కారు. దాయాది పాక్ దొంగదాడులపై మండిపడుతూ భారత సైన్యానికి మద్దతుగా నినాదాలు చేస్తున్నారు. విజయవాడలో ముస్లింల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరగగా, జ్యూయలరీ పార్క్ ప్రతినిధుల ఆధ్వర్యంలో మచిలీపట్నంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.



వివాహంలో విషాదం

పెళ్లికి వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

ఇద్దరు యువకులు దుర్మరణం

- ఐదుగురికి తీవ్రగాయాలు
- ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్త వల్లే..


విన్నకోటలో బోల్తా పడిన ట్రాక్టర్


అరుణ్ (ఫైల్)


అభిషేక్ (ఫైల్)

గుడ్లవల్లేరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : వివాహ వేడుకలకు ఉత్సాహంగా బయల్దేరిన రెండు, మూడు నిమిషాలకే ఆ కుటుంబాల్లో తీరని విషాదం నిండింది. ట్రాక్టర్ బోల్తాపడి గుడ్లవల్లేరు మండలం విన్నకోట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. గుడ్లవల్లేరు పోలీసుల కథనం మేరకు.. విన్నకోట గ్రామానికి చెందిన చేబ్రోలు అదాం కుమార్తె వివాహం నందివాడ మండలం గాజుల పాడు గ్రామంలో గురువారం జరిగింది. పెళ్లికూతురు బంధువులు ముందుగా బస్సు, కారు, ఆటోలో విన్నకోట దళితవాడ నుంచి బయల్దేరి వెళ్లారు. కొంతసేపటికి గ్రామంలోని 20 మంది.. ఓ ట్రాక్టర్‌లో బయల్దేరారు. ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ అజాగ్రత్త వల్ల సరిగ్గా వందమీటర్లు ముందుకు వెళ్లేసరికి అంగన్వాడీ కేంద్రం సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న మిగతా 6లో..



సేవకు సత్కారం

ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా కలెక్టర్ డీకే బాలాజీ అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. గత ఏడాది బుడమేరుకు వరదలు సంభవించిన సమయంలో జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, ఎదురుమొండి దీవుల ప్రజలు ఇబ్బందులు పడకుండా రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా సేవలందించిన కలెక్టర్ బాలాజీ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కాగా, ఈ సత్కారాన్ని పురస్కరించుకుని కలెక్టర్ బాలాజీని కలెక్టరేట్‌లోని అధికారులు ఘనంగా సత్కరించారు.

- మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి

మసులా బీచ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు చేయాలి

- ఈనెల 15 నుంచి 17 వరకు మంగినపూడి బీచ్‌లో నిర్వహణ
- కలెక్టర్ బాలాజీ

6లో

చెరువులను చెరపట్టి..

కృత్తివెన్ను మండలంలో బడాబాబుల అక్రమ తవ్వకాలు

- అసైన్డ్ భూములను రైతుల నుంచి తక్కువకు లీజుకు తీసుకుని..
- వందకుపైగా ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లతో చెరువులుగా తవ్వకాలు
- పక్కజిల్లా నేతలు, బడాబాబుల జోక్యంతో పట్టించుకోని అధికారులు
- రెవెన్యూ సరిహద్దులను కూడా చెరిపేసి ఇష్టానుసారంగా..

నిడమర్రు చెరువుల తవ్వకాల్లో పదుల సంఖ్యలో ఎక్స్‌కవేటర్లు



ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా సుమారు వెయ్యి ఎకరాల అసైన్డ్ భూముల పై పెద్దల కన్ను పడింది. పక్క జిల్లాకు చెందిన పెద్దపెద్ద నాయకులు, బడా బాబులు, స్థానిక నాయకులతో ఏకమై, వాటిని లీజు రూపంలో పేదల నుంచి అతితక్కువకు తీసుకుని, ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా రొయ్యల చెరువులుగా మార్చేస్తున్నారు. వందకు పైగా ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లతో చకచకా పనులు చేపడుతున్నారు. పెద్దలంతా ఏకమై అక్రమ చెరువులు తవ్వేస్తుంటే, అధికారులు మాత్రం తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

కృత్తివెన్ను, మే 8 : కృత్తివెన్ను మండలం గరిశపూడి, నిడమర్రు రెవెన్యూ గ్రామాల సరిహద్దుల్లో వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. వీటిని గతంలో ఆయా గ్రామాల్లోని పేదలు ఆక్రమించుకుని సాగులోకి తీసుకొచ్చారు. వారికి ప్రభుత్వం బీఫాం పట్టాలు ఇచ్చింది. నాటి నుంచి చిన్నచిన్న చెరువులుగా రైతులు సాగు చేసుకుంటున్నారు. కాగా, ఇటీవల బడాబాబులు ప్రవేశించారు. ఇప్పటికే మండలవ్యాప్తంగా విచ్చలవిడిగా చెరువులను తవ్వేసిన వీరు.. ఇప్పుడు అసైన్డ్ భూములపై కూడా కన్నేశారు. స్థానిక నాయకుల అండతో చిన్న, సన్నకారు రైతులతో మాట్లాడి, తక్కువ లీజుకు భూములు పొందుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా వేలాది ఎకరాల అసైన్డ్ భూములను పూర్తిస్థాయి చెరువులుగా తవ్వేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడటమే కాకుండా అసైన్డ్ భూములన్నీ అన్యాక్రాంతమవుతున్నాయి. ఈ బడాబాబులతో పాటు పక్క జిల్లాల ప్రజాప్రతినిధులు ఈ అక్రమ చెరువుల తవ్వకాల్లో భాగస్వాములు కావడంతో పాటు స్థానిక నాయకుల అండ ఉండటంతో అధికారులు కూడా పట్టించుకోవట్లేదు.

వామ్మో.. ఎన్ని ఎక్స్‌కవేటర్లో..

ఈ చెరువుల తవ్వకాల్లో వందకు తగ్గకుండా ఎక్స్‌కవేటర్లు, అంతకుమించి ట్రాక్టర్లు పనిచేస్తున్నాయి. సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఈ వాహనాలు పరుగులు మిగతా 6లో..

పెదలంక డ్రెయిన్ గట్టే సరిహద్దు

ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి లేకుండా జరుగుతున్న ఈ చెరువుల అక్రమ తవ్వకాల్లో నిబంధనలను గాలికొదిలేశారు. పెదలంక డ్రెయిన్ గట్టునే సరిహద్దుగా చేసుకుని గరిశపూడి, నిడమర్రు, దోమలగొంది, పెదగొల్లపాలెం, పోడు గ్రామాల మధ్య ఉన్న వేలాది ఎకరాల భూములన్నింటినీ చెరువులుగా మార్చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా డ్రెయిన్ గట్టుకు కనీస దూరం పాటించకుండా, గట్టునే సరిహద్దుగా మార్చేశారు. రెవెన్యూ గ్రామ సరిహద్దులను కూడా తుడిచేస్తూ, అన్ని గ్రామాల మధ్య ఉన్న చెరువులను ఎడాపెడా వారికి అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. దీనివల్ల భవిష్యత్తులో రైతుల భూములకు హద్దులతో పాటు రెవెన్యూ గ్రామాల మధ్య హద్దులు కూడా చెదిరిపోయే ప్రమాదం ఉందని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌కో.. పెంచుకో..

గంగూరు-గుణదల విద్యుత్ లైన్‌కు భారీ అంచనాలు

- తెలంగాణాలో కిలోమీటరుకు రూ.50 వేలు
- మనకు మాత్రం రూ.2.50 లక్షలట..!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ట్రాన్స్‌కో రూటే సెపరేటు'గా ఉంది. భారీగా అంచనాలు పెంచడం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో తెలియదు కానీ, ఇటీవల కాలంలో తీవ్ర వివాదాల్లో చిక్కుకుంటోంది. కృష్ణాజిల్లా గంగూరు నుంచి ఎన్టీఆర్ జిల్లా గుణదల వరకు 132 కేవీ హైటెన్షన్ కండక్టర్స్ (లైన్లు) ఏర్పాటుకు పిలిచిన టెండర్లలో అధిక అంచనాలను పేర్కొనడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పొరుగు రాష్ట్రం తెలంగాణాతో పోల్చుకుంటే నాలుగు రెట్ల అధికంగా లైన్‌లాగే ఖర్చును నిర్ణయించటమే ఈ వివాదాలకు కారణం. గంగూరు నుంచి గుణదల వరకు ప్రస్తుతం పాత హైటెన్షన్ కండక్టర్ లైన్లు (హెచ్‌టీఎల్ఎస్) ఉన్నాయి. వీటిని పూర్తిగా అధునాతన హెచ్‌టీఎల్ ఎస్‌లుగా మార్చాలని నిర్ణయించారు. దీనికోసం ఇటీవలే ట్రాన్స్‌కో అధికారులు మిగతా 6లో..

నెమ్మదిగా నిర్మాణాలు..!

కృష్ణా యూనివర్సిటీలో అంతా గందరగోళం

- ప్రశ్నార్థకంగా ఇంజనీరింగ్, బాలుర వసతి గృహం నిర్మాణాలు
- రూ.కోట్లలో బిల్లులు చెల్లించి మధ్యలో పనుల నిలిపివేత
- బాలికల వసతిగృహం పనులకు మాత్రమే గ్రీన్‌సిగ్నల్
- 950 మందికి పైగా విద్యార్థులున్నా.. ఇంజనీరింగ్ భవన నిర్మాణ పనులు నిలిపివేత..!


నిలిచిపోయిన ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు

కృష్ణా యూనివర్సిటీ అధికారుల నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయి. వర్సిటీ ప్రాంగణంలో అవసరమైన పనులు చేయకుండా అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీ నూతన ప్రాంగణంలోకి మారి ఆరేళ్లు గడుస్తున్నా ఇంతవరకు బాలురు, బాలికల వసతిగృహాలు సమకూరలేదు. ఇటీవల వర్సిటీ ప్రాంగణంలో ఇంజనీరింగ్ కళాశాల, బాలుర వసతిగృహం భవనాల నిర్మాణ పనులను నిలిపివేయాలని నిర్ణయించారు. దీంతో ఇప్పట్లో ఈ రెండు భవనాల నిర్మాణం జరిగే సూచనలు కనిపించట్లేదు. ఇంతకాలంగా వసతిగృహాలు అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ వివిధ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ముందుకురాని పరిస్థితి ఏర్పడింది.

పనులు ప్రారంభించి నిలిపేశారు

మూడేళ్ల కిందట కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలో బాలికలు, బాలురు, ఇంజనీరింగ్ కళాశాల, ఫుడ్‌కోర్టు, ఫార్మసీ కళాశాల భవనాలతో పాటు ప్రహరీల నిర్మాణ పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్లు భవనాల పనులను పునాదుల దశ వరకు పూర్తిచేసి, ఆ తర్వాత నిలిపివేశారు. రెండున్నర నెలల కిందట వీసీగా కె.రాంజీ బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఈ భవనాల నిర్మాణంపై ఆయన మిగతా 6లో..

విజయవాడలో అల్ట్రా మోడ్రన్ లాజిస్టిక్ కంపెనీ

- గన్నవరంలో ఎన్-16కు ఆనుకుని ఏర్పాటు
- ప్రముఖ లాజిస్టిక్ సంస్థ సేఫెక్స్‌ప్రెస్ వెల్లడి

6లో

టీడీపీ అవనిగడ్డ ఇన్‌చార్జిపై కొనసాగుతున్న కసరత్తు

- మహానాడులోగా ప్రకటించే అవకాశం



విజయవాడలో ఆల్ట్రా మోడ్రన్ లాజిస్టిక్ కంపెనీ

- గన్నవరంలో ఎన్-16కు ఆనుకుని ఏర్పాటు
- ప్రముఖ లాజిస్టిక్ సంస్థ సేఫెక్స్‌ప్రెస్ వెల్లడి

విజయవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఫైన్ అండ్ లాజిస్టిక్స్ అత్యాధునిక పార్క్‌ను విజయవాడలో ప్రముఖ సేఫెక్స్ కంపెనీ ప్రారంభించింది. గన్నవరంలో ఎన్‌హెచ్-16 ఆనుకుని ఉన్న సవరగూడెంలో ప్రముఖ లాజిస్టిక్ కంపెనీ సేఫెక్స్‌ప్రెస్ తమ ఉత్పత్తులను తాజాగా ప్రారంభించారు. సుమారు 3.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సంస్థలో అధునాతన ట్రాన్స్‌షిప్‌మెంట్ పాటు థర్డ్‌పార్టీ లాజిస్టిక్స్ సామర్థ్యం కూడా ఉంది. వచ్చిన సరుకును నిల్వచేసి కాలయాపన చేయకుండా 100 కంటే ఎక్కువ వాహనాలను ఒకేసారి లోడ్, అన్‌లోడ్ చేయడానికి వీలుగా ఏర్పాటుచేశారు. దుస్తులు, వ్యవసాయ ప్రాసెసింగ్, ఆటోమొబైల్, ఫార్మా వంటి విభిన్న పరిశ్రమలకు నగరం ప్రసిద్ధి చెందడంతో ఐటీ, నిర్మాణ పరిశ్రమల అభివృద్ధితో పాటు ఆర్థిక, నగరాభివృద్ధికి దోహదపడుతుంది. గన్నవరం, పరిసర ప్రాంతాల్లో వ్యాపారాలు అభివృద్ధి చెందుతున్న క్రమంలో గిడ్డంగి, పంపిణీ అవసరాలకనుగుణంగా వేగంగా, సమర్థవంతంగా సరఫరా చేసే చైన్ కనెక్టివిటీని రూపొందిస్తున్నట్లు కంపెనీ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరం, రాజధానికి ఆనుకుని ఉండడంతో ప్రధాన వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అద్భుతమైన రహదారుల కనెక్టివిటీ ఉండడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి కార్యకలాపాలను గమ్యస్థానాలకు వేగంగా చేర్చడానికి సహాయపడుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రారంభోత్సవానికి సేఫెక్స్‌ప్రెస్ సీనియర్ అధికారులు హాజరయ్యారు.

రూ.4 లక్షల విలువైన కరెంటు తీగల చోరీ

- కొత్త లైన్ ప్రారంభం కాకుండానే దొంగల దురాగతం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఏఈ


చాగంటిపాడు రోడ్డువెంట విద్యుత్ లైన్ తీగలు లేని స్తంభం

తోట్లవల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): చాగంటిపాడు, కళ్లంవారిపాలెం గ్రామాల గృహాలకు 24 గంటల విద్యుత్ సరఫరా కోసం నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ లైన్ తీగలను బుధవారం రాత్రి దొంగలు కత్తిరించుకుపోయారు. 30 కరెంటు స్తంభాలపైన తీగలను దొంగలు కత్తిరించేశారు. ప్రధాన రహదారివెంట స్తంభాలపై తీగలను కట్ చేసుకుపోవటం రైతులను, ప్రజలను ఆందోళనకు గురిచేసింది. కొద్దిరోజుల్లో ఈ నూతన లైన్‌ను ప్రారంభించాల్సి ఉండగా తీగలను కట్ చేయటంతో విద్యుత్ అధికారులు ఉలిక్కిపడ్డారు. ఇది భారీ దొంగతనంగా భావిస్తున్నారు. రాత్రి సమయాల్లో పోలీసుల నిఘా లోపం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. 30 స్తంభాలపైన కత్తిరించుకుపోయిన కరెంటు తీగల విలువ రూ.4లక్షల వరకు ఉంటుందని విద్యుత్ ఏఈ దేవదాసు తెలిపారు. ఈ ఘటనపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఏఈ తెలిపారు.

'అవనిగడ్డ ఇన్‌చార్జి'పై కసరత్తు..!

- నాయకుడు లేక తమ్ముళ్ల అసంతృప్తి
- చల్లార్చేందుకు అధిష్ఠానం కార్యాచరణ
- పరిశీలనలో పలువురి పేర్లు
- మహానాడులోగా ప్రకటించే అవకాశం
- రేసులో పలువురు ఆశావహులు



అవనిగడ్డ, మే 8 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చేందుకు పార్టీ అధినాయకత్వం చర్యలు ప్రారంభించింది. నియోజకవర్గ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ జనసేన పార్టీలో చేరటంతో టీడీపీకి ఇన్‌చార్జి లేకుండాపోయారు. దీంతో కూటమిలో తగిన గుర్తింపు ఉండటం లేదని, కనీసం మండల అధికారులతోనూ చిన్న చిన్న పనులు చేయించుకోలేకపోతున్నామని, ఇటీవల చల్లపల్లిలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో పార్టీశ్రేణులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ ఇద్దరూ జనసేన పార్టీకి చెందిన వారు కావటంతో ఏ చిన్న అవసరం వచ్చినా ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావటం లేదని వారు ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.

అసంతృప్తిని చల్లార్చే పనిలో పార్టీ

పార్టీ కార్యకర్తలు, ముఖ్య నేతల అభీష్టం మేరకు ఇన్‌చార్జిని నియమించే కసరత్తు పార్టీ ప్రారంభించిందని బుధవారం నియోజకవర్గ పర్యటనలో మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మహానాడులోగానే పార్టీ ఇన్‌చార్జిని నియమిస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలువురు ముఖ్యనేతల గురించి పార్టీ అధిష్ఠానం ఆరా తీయగా, వారు పార్టీ అభ్యున్నతి కోసం కొందరి పేర్లు సూచించారు. గత రెండు రోజులుగా సదరు నేతల వివరాలను పార్టీ సెంట్రల్ కార్యాలయం సేకరిస్తోంది.

రేసులో పలువురి పేర్లు..

ఇన్‌చార్జి నియామకం విషయంలో నియోజకవర్గం నుంచి పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఎన్ఆర్ఐగా 2012 నుంచి 2019 వరకు పార్టీ కోసం విశేషంగా కృషిచేసిన గోవర్ధన్ 2024 వరకు పార్టీ కార్యక్రమాలకు వనరులను సమకూరుస్తూ నేతలకు చేదోడుగా ఉంటూవచ్చారు. సొంత ఖర్చులతో పార్టీ కార్యాలయం ఏర్పాటు, పార్టీ సభ్యత్వాలను 40 వేలకు దాటించటంలో కీలకపాత్ర పోషించారు. రేసులో రెండో వ్యక్తిగా పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ పేరు ప్రముఖంగా వినవస్తోంది. ఇప్పటి వరకు ఆయనకు ఏ పార్టీ సభ్యత్వం లేకపోయినప్పటికీ ఈ ప్రాంత వాసులతో మంచి పరిచయాలుండటం, సేవా కార్యక్రమాలతో గుర్తింపు తెచ్చుకోవడం, కొద్దినెలలుగా టీడీపీలో చేరేందుకు పావులు కదుపుతున్నారు. వైసీపీకి చెందిన ఓ ప్రధాన నేత పేరు కూడా పార్టీ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. సదరు నేత సమీప బంధువు వైసీపీ ఎమ్మెల్సీగా ఉండటం, ఇటీవల చంద్రబాబును కలవటం ఈ ప్రచారానికి బలం చేకూరుస్తోంది. వీరితో పాటు తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, చల్లపల్లి మండల ప్రముఖులు సజ్జా చలపతిరావు, మోపిదేవి జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జున రావు, కోడూరు మాజీ జడ్పీటీసీ బండే శ్రీనివాసరావుల పేర్లు పేర్లు వినవస్తున్నాయి. బుధవారం రాత్రి పార్టీ ముఖ్యనేతలతో జిల్లా నాయకత్వం జరిపిన అంతరంగ సమావేశంలో ఇన్‌చార్జి నియామకంపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. వీరిలో ఒకరికి ఇన్‌చార్జి ఇవ్వటమా.. లేదా టూ మ్యాన్ కమిటీ ద్వారా కొద్ది రోజులు పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలా.. అన్న దానిపై చర్చ జరుగుతోంది. మొత్తం మీద నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికి అన్నది చర్చనీయాంశంగా మారింది.

ఒకే కొమ్మకు పూచిన పుష్పం



ఒక చెట్టుకు పూచిన పూలు ఒకే విధంగా ఉండటం మామూలే కానీ హనుమాన్‌జంక్షన్‌లోని విశ్రాంత ఉపాధ్యాయుడు అక్కినేని రాఘవేంద్రరావు ఇంటి పెరిటిలో ఉన్న పసుపు పూల మందార చెట్టుకున్న ఒకే కొమ్మకు రెండు రంగుల్లో పూలు పూశాయి. చుక్కల్లో చంద్రుడిలా పసుపు మందారాల మధ్య ఎరుపు మందారం ఆకర్షణీయంగా నిలచింది. సేంద్రియ ఎరువులతో సాధారణ పోషణ చేస్తున్నామని రాఘవేంద్రరావు తెలిపారు. పెరటి చెట్లలో జన్యుపరమైన మార్పులకు లోనైతే ఇలాంటి ప్రత్యేకత వస్తుందని బాపులపాడు మండల ఉద్యానవనశాఖ అధికారి హరిశ్చంద్ వివరించారు.

- హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆంధ్రజ్యోతి

ఇటుక బట్టీలకు మంచి రోజులు

- వందల సంఖ్యలో ఇటుక బట్టీలు.. రూ. కోట్లలో వ్యాపారం
- వేల సంఖ్యలో స్థానిక, వలస కూలీలకు ఉపాధి

అమరావతిలో నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కానుండటంతో నిర్మాణ రంగంపై ఆధారపడిన ఇటుక బట్టీ నిర్వాహకులు, కార్మికుల ఆశలు చిగురిస్తున్నాయి. రాజధానిలో పనులు ఎప్పుడు ఊపందుకుంటాయా అని ముఖ్యంగా ఇటుక బట్టీల నిర్వాహకులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. నిర్మాణ రంగం ఆశాజనకంగా లేకపోవటంతో దెబ్బతిన్న ఇటుక బట్టీల యజమానులు ఆ నష్టాన్ని ఎంత త్వరగా పూడ్చుకుందామా అని ఆశగా ఉన్నారు. ప్రస్తుతం పతాక స్థాయిలో బట్టీల్లో ఇటుకల తయారీ జరుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో ఊపందుకుంటున్న ఇటుక బట్టీలపైప్రత్యేక కథనం..

- ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం



కరోనా తర్వాత నిర్మాణ రంగంలో స్తబ్దత, 2019లో వైసీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేయడం, అమరావతి పనులు నిలిచిపోవడంతో ఇటుక బట్టీలు భారీ నష్టాలను చవిచూశాయి. ఇసుక ఖరీదైన భారంగా మారడంతో కార్మికుల జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి. 2024లో కూటమి ప్రభుత్వం తిరిగి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంతో నిర్మాణ రంగం కోలుకుంటోంది. అమరావతిలో పనులు ఊపందుకోవడంతో ఇటుకలకు గిరాకీ పెరిగే అవకాశం ఉంది.

ఇటుక బట్టీల్లో జోరుగా తయారీ

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాల్లో వందల ఇటుక బట్టీలు కోట్ల సంఖ్యలో ఇటుకలను తయారు చేస్తున్నాయి. స్థానిక కూలీలతో పాటు ఒడిశా నుంచి వచ్చిన కార్మికులు రాయి తీత పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ప్రస్తుతం ఇటుక ధర రూ.6గా ఉండగా, అమరావతిలో పనులు జోరందుకుంటే రూ.10 వరకు పెరిగే అవకాశం ఉంది. చెరువుల నుంచి సేకరించే సారవంతమైన మట్టి, ఎన్టీటీపీఎస్ బూడిద, రైస్ మిల్లుల నుంచి వరి పొట్టు, స్థానికంగా లభించే కలప వంటి ముడిసరుకులతో ఇటుకల తయారీ సాగుతోంది. ఈ బట్టీలు కుటీర పరిశ్రమలుగా వృద్ధి చెందుతున్నాయి.

గ్రామాభివృద్ధికి దోహదం

2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇటుక బట్టీలు గ్రామాల అభివృద్ధికి గణనీయంగా దోహదపడ్డాయి. వెలగలేరు, వెల్లటూరు, కుంటముక్కల గ్రామాల్లో కోట్ల రూపాయలు విరాళంగా ఇచ్చి, సీసీ రోడ్ల నిర్మాణంలో సహకరించాయి. ప్రభుత్వ పక్కా గృహాల కోసం తయారీ ధరకే ఇటుకలను సరఫరా చేసి పేదలకు ఉపయోగపడ్డాయి. బట్టీల కోసం భూమి కౌలు ధరలు ఎకరానికి రూ.50వేల వరకు పెరగడంతో రైతులకు లాభం చేకూరింది. కూలీల వారం వారం బట్వాడాతో స్థానిక మార్కెట్లు, హోటళ్ల కళకళలాడుతున్నాయి.

సవాళ్లు-కాలుష్య సమస్యలు

అకాల వర్షాలు, ఈదురు గాలులు, బుడమేరు వరదల వంటి ప్రకృతి వైపరీత్యాలు బట్టీలకు నష్టం కలిగిస్తున్నాయి. పచ్చి ఇటుకలు తడిసి నాశనమవడం, కొన్ని బట్టీలు కొట్టుకుపోవడం జరిగింది. ప్రభుత్వం నుంచి బీమా లేదా ఆర్థిక సహాయం లేకపోవడం శోచనీయం. బట్టీల నుంచి వెలువడే



కాలుష్యం, బయో టాయిలెట్ల లేమితో సమీప పొలాల్లో కార్మికులు కాలకృత్యాలు తీర్చుకోవడంపై స్థానిక రైతుల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి.

లైట్ వెయిట్ బ్రిక్స్‌కు గిరాకీ

ఇటుకలతో పాటు లైట్‌వెయిట్ బ్రిక్స్‌కు కూడా డిమాండ్ పెరుగుతోంది. కట్టుబడిపాలెం-కవులూరు రోడ్డులోని ఎన్‌సీఎల్ బిల్డ్‌టెక్ కంపెనీ లైట్‌వెయిట్ బ్రిక్స్‌ను పెద్ద ఎత్తున తయారు చేసి రాష్ట్రవ్యాప్తంగా ఎగుమతి చేస్తోంది. ఈ బ్రిక్స్ అపార్ట్‌మెంట్లు, గ్రామీణ నిర్మాణాల్లో విరివిగా వాడబడుతున్నాయి. అయితే, పేదలు, ప్రభుత్వ గృహ నిర్మాణాల కోసం సిమెంట్ రాళ్లనే ఎక్కువగా ఎంచుకుంటున్నారు, ఎందుకంటే అవి తక్కువ ఖర్చుతో త్వరగా నిర్మాణం పూర్తి చేయడానికి వీలు కల్పిస్తున్నాయి. అమరావతి నిర్మాణ పనులు ఊపందుకోవడంతో ఇటుక బట్టీలు, నిర్మాణ రంగం మళ్లీ జోష్‌లోకి వస్తున్నాయి. గత నష్టాల నుంచి కోలుకునేందుకు నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మసులా బీచ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు

- కలెక్టర్ బాలాజీ


మసులాబీచ్ ఫెస్టివల్‌పై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి 17 వరకు మంగినపూడి బీచ్‌లో జరిగే మసులా బీచ్ ఫెస్టివల్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులకు ఆదేశించారు. ఎస్పీ ఆర్ గంగాధరరావుతో కలసి మసులా బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై కలెక్టర్ తన ఛాంబరులో గురువారం సమావేశం నిర్వహించారు. బీచ్‌లో చేసే ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. బీచ్‌లో ఫుడ్‌కోర్టులు, క్రీడల నిర్వహణ," పడవపందేలు, వైద్యశిబిరాలు, ట్రాఫిక్ ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఇక్కడ ఏర్పాటు చేయాల్సిన వసతులు, వైద్యశిబిరాలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. లక్షలాదిమంది ఈ ఫెస్టివల్‌కు వచ్చే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో అన్ని విధాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సాయంత్రం సమయంలోనే కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని, ఈ నేపథ్యంలో రహదారుల వెంబడి విద్యుత్‌లైట్ల ఏర్పాటు, సీసీ కెమెరాలతో నిఘాను మరింతగా పెంచాలన్నారు. సముద్రంలోతులోకి పర్యాటకులు వెళ్లకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు, పోలీసులు తమవంతుగా బీచ్‌లో అందుబాటులో ఉండాలన్నారు. ఇక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులు, కళాకారులకు వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జైద్, డీఆర్వో కే చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, డీసీఎస్పీ సీహెచ్ రాజా, మెప్మా పీడీ సాయిబాబు, ఈవెంట్ ఆర్గనైజర్ ఆనంద్ పాల్గొన్నారు.

అన్నవరం సత్యదేవునికి దుర్గమ్మ తరపున పట్టువస్త్రాలు



ఇంద్రకీలాద్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాల సందర్భంగా గురువారం సత్యదేవునికి దుర్గామల్లేశ్వర దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు లింగంబొట్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక బృందం, రమా సహిత సత్యనారాయణ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు తీసుకు వెళ్లిన బృందానికి అన్నవరం దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామికి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

జాతీయ రహదారులపై ఇక సోలార్ వెలుగులు

- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో మూడు జాతీయ రహదారులు గుర్తింపు
- ఎన్‌హెచ్ - 16, ఎన్‌హెచ్ - 216, ఎన్‌హెచ్ - 216ఏ లలో
- 106 లొకేషన్లలో సోలార్ దీపాల ఏర్పాటుకు రూ. 13.18 కోట్లతో టెండర్



ఆంధ్రజ్యోతి, విజయవాడ: జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు వీలుగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలో గుర్తించిన బ్లాక్‌స్పాట్‌లలో సోలార్ విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) నిర్ణయించింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పరిధిలోని ఎన్‌హెచ్ - 16, ఎన్‌హెచ్ - 216, ఎన్‌హెచ్ - 216ఏ లలో మొత్తం 104 లొకేషన్లలో సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎన్‌హెచ్ అధికారులు తాజాగా రూ.13.18 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. విజయవాడ ఆర్ఓ కార్యాలయం పరిధిలో మే 20న బిడ్లను ఓపెన్ చేస్తారు. సౌర విద్యుత్ దీపాల వల్ల హైవేల మీద ప్రకాశవంతమైన కాంతులు వెదజల్లనున్నాయి. హైవేల మీద విద్యుత్ సదుపాయం లేని ప్రాంతాల్లో సోలార్ దీపాల వల్ల ఆ సమస్య నుంచి బయట పడటానికి అవకాశం ఉంటుంది. విద్యుత్ లేని చోట సోలార్ దీపాలైతేనే విద్యుత్తుతో పని లేకుండా దీపాలను వెలిగించవచ్చు. ప్రమాదకర ప్రాంతాలలో సోలార్ దీపాలను ఏర్పాటు చేయటం వల్ల గణనీయంగా ప్రమాదాలు తగ్గటానికి అవకాశం ఉంటుంది.

అండర్-19 క్రికెట్ జట్టుకు యార్లగడ్డ సోదరుల ఎంపిక


జట్టుకు ఎంపికైన అవినాష్, హేమంత్

కూచిపూడి, మే 8 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందిన అన్నదమ్ములు యార్లగడ్డ అవినాష్, యార్లగడ్డ హేమంత్ అండర్-19 కృష్ణాజిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. త్వరలో జరిగే పోటీల్లో జి ల్లా జట్టు తరఫున వీరు ఆడతారు. వీ రిద్దరూ మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో అనేక పర్యాయాలు క్రికెట్ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. యార్లగడ్డ సోదరులు జిల్లా స్థాయికి ఎంపిక కావటంపై చందు యాత్‌తోపాటు కాజ గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

చెరువులను చెరపట్టి..

(5వ పేజీ తరువాయి)

పెడుతున్నాయి. అక్రమ తవ్వకాలు కావటంతో శరవేగంగా పనులు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ఇన్ని వాహనాలను ఉపయోగిస్తున్నారు. కనీసం ఇప్పుడైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువుల అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అనుమతుల్లేవ్.. అడ్డుకుంటాం..

చెరువుల తవ్వకాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేవు. తవ్వకాలు జరుగుతున్న భూములు కూడా అసైన్డ్ భూములే. కానీ తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. వెంటనే వాటిని నిలిపివేయిస్తాం.

- సోమేశ్వరరావు, కృత్తివెన్ను తహసీల్దార్

వివాహంలో విషాదం

(5వ పేజీ తరువాయి)

చేనులోకి దూసుకెళ్లింది. ట్రాక్టర్‌తో పాటు గ్రామస్తులు కూర్చున్న ట్రక్కు కూడా తిరగబడింది. ఈ ఘటనలో ముత్యాల అరుణ్‌బాబు (16), కనకవల్లి అభిషేక్ (15) అక్కడికక్కడే మృతిచెందారు. మెండ రవికిరణ్, కూర్మా నాగరాజుకు తీవ్రగాయాలు కాగా, మరికొందరికి గాయాలై గుడివాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఏఎస్ఐ వి.బాల వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను విన్నకోటకు తరలించారు.

ఆధారం అవుతాడనుకున్న కొడుకు మృత్యుఒడికి..

విన్నకోట దళితవాడకు చెందిన ముత్యాల నాగరాజు వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఇద్దరు కుమారుల్లో చిన్నవాడైన అరుణ్‌బాబు గుడ్లవల్లేరులో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. ఉన్నత విద్యావంతుడై కుటుంబాన్ని ఆదుకుంటాడని ఆశతో ఉన్న కుటుంబానికి ఈ ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది.

అమ్మమ్మ తాతయ్యకు విషాదాన్ని మిగిల్చి..

తల్లిదండ్రులు దూరంగా ఉండటంతో అమ్మమ్మ సముద్రవేణి, తాతయ్య రాఘవులు వద్ద పెరుగుతున్నాడు అభిషేక్. తల్లి పనిచేసేందుకు కువైట్ వెళ్లగా, అభిషేక్, అతని చెల్లెలు విన్నకోటలో వృద్ధ దంపతుల వద్ద ఉంటున్నారు. అభిషేక్‌ను తిరిగిరానిలోకాలకు వెళ్లిపోవడంతో తమకు అప్పగించి వెళ్లిన కూతురికి ఏం చెప్పాలి తెలియక ఆ వృద్ధ దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ట్రాన్స్‌కో..పెంచుకో..

(5వ పేజీ తరువాయి)

టెండర్లు పిలిచారు. టెండర్లలో మెటీరియల్ విలువలో పెద్దగా అభ్యంతరాలు లేనప్పటికీ, లైన్ లాగేందుకు నిర్దేశించిన ఖర్చు మాత్రం ఆక్షేపణీయంగా ఉంది. గంగూరు నుంచి గుణదల వరకు 60 కిలోమీటర్ల దూరానికి సంబంధించి 20 కిలోమీటర్ల దూరానికి లైన్ లాగేందుకు కిలోమీటరుకు రూ.2.50 లక్షలు నిర్దేశించారు. ఇదే తెలంగాణాలో అయితే, కిలోమీటరుకు కేవలం రూ.50 వేలు మాత్రమే ఉంది. అంటే తెలంగాణ కంటే రూ.2 లక్షలు అదనంగా ఖర్చును పెంచారు. ఈ లెక్కన 20 కిలోమీటర్ల దూరానికి రూ.40 లక్షల మేర అంచనాలు పెంచారు.

నెమ్మదిగా నిర్మాణాలు..!

(5వ పేజీ తరువాయి)

సమీక్ష నిర్వహించారు. ఇంతకాలంగా నిర్మాణం నిలిచిపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రభుత్వ నిధులే కాకుండా యూనివర్సిటీ సొంత నిధులతోనే ఈ భవనాలు నిర్మించాలనే నిర్ణయం తీసుకున్నారనే అంశం వెలుగులోకి వచ్చింది. అయితే, ఈ విషయంపై ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించి.. ఇప్పటికే పనులు ప్రారంభించిన బాలుర వసతిగృహం, ఇంజనీరింగ్ కళాశాల భవనాల నిర్మాణ పనులను నిలిపివేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారనే అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. బాలికల వసతిగృహం పనులను మాత్రం జూన్ నెలాఖరుకు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇంజనీరింగ్ కళాశాలలో 950 మందికి పైగా పిల్లలు చదువుతున్నారు. వీరికి వసతి గృహంతో పాటు కళాశాలకు భవనం కూడా అవసరం. అయినా ఇంజనీరింగ్ కళాశాల భవనం నిర్మాణ పనులను నిలిపివేయడం గమనార్హం.

బిల్లుల చెల్లింపులు ఇలా..

కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలో బాలుర వసతిగృహం భవన పనులను మూడేళ్ల క్రితం ప్రారంభించారు. పునాదుల దశ వరకు పనులు చేయడంతో రూ.4.14 కోట్ల వరకు బిల్లులు చేశారు. ఈ పనులను నిలిపేస్తూ ఇటీవల నిర్ణయం తీసుకోవడం విస్మయం కలిగించే అంశం. బాలుర వసతి గృహానికి సంబంధించి మరో రూ.5.06 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉన్నట్టుగా యూనివర్సిటీ అధికారులు లెక్కలు తేల్చారు. అలాగే, ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించి తొమ్మిదేళ్లు కావస్తోంది. ఈ కళాశాలలో పిల్లలు అధికంగా ఉండటంతో దీనికి సంబంధించిన భవన పనులను ప్రారంభించి పునాదుల దశ వరకు పూర్తి చేశారు. కాంట్రాక్టర్లకు రూ.3.21 కోట్ల బిల్లులు చేశారు. ఇంతమేర బిల్లులు కాంట్రాక్టర్లకు ఇచ్చినా, ఈ భవనం పనులను ప్రస్తుతం నిలిపేశారు. ఇంజనీరింగ్ కళాశాల భవనానికి సంబంధించి రూ.3.93 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉందని యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఇంగ్లీష్, ఫిజిక్స్, కామర్స్ తదితర కోర్సుల్లో ఇద్దరు ముగ్గురికి మించి విద్యార్థులు లేరు. ఎమ్మెస్సీ మేథమెటిక్స్ కోర్సులో ఒక్క విద్యార్థి లేకపోయినా యూనివర్సిటీ భవనాల్లో రెండు, మూడు గదులు కేటాయించారు. ఇంజనీరింగ్ కోర్సులు చదివే విద్యార్థులు 950 మంది ఉన్నా ఆ భవనాన్ని నిలిపివేయడం గమనించదగ్గ అంశం.

బాలికల వసతిగృహం జూన్‌కు పూర్తయ్యేనా?

ప్రస్తుతం యూనివర్సిటీ ప్రాంగణంలో బాలికల వసతిగృహం పనులు జరుగుతున్నాయి. ఈ పనులను జూన్ నాటికి పూర్తిచేస్తామని వీసీ కె.రాంజీ ప్రకటించారు. ఈ భవనంలో ఫర్నీచర్, విద్యుత్, ఇతరత్రా పనులకు సంబంధించి టెండర్లు పిలవాల్సి ఉంది. ఎప్పటికి టెండర్లు పిలుస్తారు, ఎప్పటికి కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు, ఎప్పటికి పూర్తిచేస్తారనే అంశంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. జూన్ 25న యూనివర్సిటీ స్నాతకోత్సవం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్నాతకోత్సవానికి గవర్నర్ అనుమతులు కూడా తీసుకున్నారు. అయితే, ఈ తేదీ నాటికి బాలికల వసతిగృహం నిర్మాణ పనులు పూర్తిచేస్తే గవర్నర్ చేతులమీదుగా ప్రారంభించే అవకాశం ఉంటుంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

సర్పంచులకు సమ్మె నోటీసులు



పెనమలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త సమ్మె ఈ నెల 20న నేపథ్యంలో గంగూరు, గోసాల, వణుకూరు, చోడవరం, పెనమలూరు, పెదపులిపాక పంచాయతీల సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సీఐటీయూ నాయకులు సమ్మె నోటీసు అందజేసి సమ్మెకు సహకరించాలని కోరారు. గురువారం జరిగిన ఈకార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, గోగులమూడి వేణుబాబు, మోహన్‌రావు, సురేష్, వేణు, దొడ్డ ప్రకాష్, కొడాలి నాగమణి, పందిపాటి వాణి, కొవ్వల నాగమణి, గొర్రె రుతమ్మ తదితరులు పాల్గొన్నారు.



పురుషోత్తపట్నం పరిధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో హోమాలు చేస్తున్న భక్తులు

వైభవంగా భద్రావతి సమేత భావన ఋషి విగ్రహ ప్రతిష్ఠ

గన్నవరం, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పురుషోత్తప ట్నం పరిధిలో నూతనంగా నిర్మించిన భద్రావతి సమేత భావన ఋషి స్వామి వార్ల ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠలు వైభవంగా జరిగాయి. భద్రావతీ సమేత భావన ఋషి, విఘ్నేశ్వరుడు, సరస్వతిదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ మహోత్సవానికి ప్రజలు, భక్తులు వేలాది హాజరయ్యారు. ధ్వజస్తంభం ఆవిష్కరణ జరిగింది. గన్నవరం సీఐ బీవీ శివప్రసాద్ పూజలు చేశారు. ప్రతిష్ఠాపన అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు నిర్మించిన బస్‌షెల్టర్‌ను పురుషోత్తపట్నం సర్పంచ్ మాదల రోహిణీ సాంబశివరావు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో డి.నారద మునియ్య, సామల ఆంజనేయులు, కౌతరపు రామకృష్ణ, వెంగల వెంకటేశ్వరరావు, వెంగల నాని, దార్న శివాజీ, తమ్మిశెట్టి నాగ మురళీకృష్ణ, బీబీగూడెం మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి రఘుబాబు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

గన్నవరం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత అంతర్జాతీయ రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు జాన్ హెన్రీ డూన్ హంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో మానవతా సంస్థతో కలసి రెడ్ క్రాస్ ప్రతినిధులకు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ చిన్ని మాధవి, వైస్ ఛైర్మన్ వీవీ కృష్ణమోహన్, ప్రతినిధులు ఎం.ప్రభాకరచౌదరి, డాక్టర్ ఎం.విజయ కుమార్, గన్నె వెంకట్రావు, మానవతా అధ్యక్షులు మడుపల్లి బాలకృష్ణమూర్తి, వీసం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర మూకలను హతమార్చడంలో

ఎన్డీయే ప్రభుత్వం సఫలం

టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు



కానూరులో నినాదాలు చేస్తున్న వెలగపూడి శంకరబాబు తదితరులు

పెనమలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : పహల్గాంలో భారత టూరిస్టులను హతమార్చిన ఉగ్రమూకలను అంతమొందించడంలో ఎన్డీయే ప్రభుత్వం సఫలమైందని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పేర్కొన్నారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో గురువారం ఆయన కానూరులో టీడీపీ నేతలు యార్లగడ్డ సుచిత్ర, షేక్ బుజ్జి తదితరులతో కలిసి పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెలగపూడి శంకరబాబు మాట్లాడుతూ, ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత ప్రభుత్వం పాకిస్థాన్, పీఓకేలలోని ఉగ్రవాదుల స్థావరాలను సమూలంగా నేలమట్టం చేసి వందల మంది ఉగ్రవాదులను అంత మొందించడం హర్షణీయమన్నారు. భారతదేశ సైన్యం ధైర్య సాహసాలను చూసి ప్రతి భారతపౌరుడు గర్విస్తున్నాడని పేర్కొన్నారు. ఉగ్రవాదుల పీచమణచడంలో భారత్ ఎప్పుడూ ముందుంటుందని వ్యాఖ్యానించారు. తన గడ్డ మీద రాచమర్యాదలు అందుకుంటూ మన దేశాన్ని అస్థిరపరచాలనుకొనే ఉగ్రవాదులను పాకిస్థాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్‌కు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని పాకిస్థాన్ ఉగ్రవాదులకు సాయం ఆపాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ సత్యనారాయణ, దోనెపూడి రవికిరణ్, గుంటుపల్లి శ్రీనివాసరావు, షేక్ ఇమాం తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కంకిపాడు గ్రామ అధ్యక్షుడిగా చిట్టూరి నాగేశ్వరరావును ఎంపిక చేసిన మాజీ ఎంపీపీ దేవినేని, తుమ్మలపల్లి తదితరులు

టీడీపీ కంకిపాడు అధ్యక్షుడిగా చిట్టూరి

- మూడు సామాజిక వర్గాల మధ్య పోరు
- గౌడ సామాజిక వర్గానికి పగ్గాలు

కంకిపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కంకిపాడు గ్రామ అధ్యక్షుడి పోరు ఉత్కంఠ భరితంగా సాగింది. నువ్వా నేనా అంటూ మూడు ప్రధాన సామాజిక వర్గాలకు చెందిన నాయకులు పోటీ పడ్డారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, తుమ్మల పల్లి హరికృష్ణలు గౌడ సామాజిక వర్గానికి చెందిన చిట్టూరి నాగేశ్వరరావుకు అధ్యక్ష పదవిని కట్టబెట్టారు. టీడీపీ కంకిపాడు అధ్యక్ష పదవి ఎంపిక గురు వారం ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణలు వ్యవహరించారు. గ్రామ పార్టీ అధ్యక్ష పదవి కోసం టీడీపీ సీనియర్ నాయకులు కాపు సామాజిక వర్గానికి చెందిన పులి శ్రీనివాసరావు, గౌడ సామాజిక వర్గానికి చెందిన చిట్టూరి నాగేశ్వరరావు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాది కాకుమాను రమేష్‌తో పాటు మహిళ నాయకురాలు అన్నవరపు శివపార్వతిలు పోటీ పడ్డారు. పరిశీలకులుగా వచ్చిన దేవినేని, తుమ్మలపల్లిలు 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అడుగులు వెసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి నాంచారయ్య, పులి శ్రీనివాసరావు, శేషకుమారి, చలవాది రాజా, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారిని కల్యాణ వేదిక వద్దకు పల్లకిలో తోడ్కొని వెళ్తున్న భక్తులు

వైభవంగా శ్రీనివాస కల్యాణం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : లోక కల్యాణార్థం భక్తులకు దైవత్వంతో సేవలందించేందుకు నిర్వహించే శ్రీశ్రీనివాస కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా జంక్షన్‌లో నిర్వహించారు. స్థానిక లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు సీతారామాచార్యుల పర్యవేక్షణలో గూడపాటి శ్రీనివాసమధు రాజ రత్నశేఖర్, వాణి దంపతుల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం వేద మంత్రాలతో మంగళవాయిద్యాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా దేవస్థానంలోని శ్రీదేవిభూదేవి సమేత శ్రీనివాసుని పల్లకిలో మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేదిక వద్దకు తోడ్కొనివచ్చారు. వేద పండితుల మంత్రోచ్చార ణల మధ్య రత్నశేఖర్, వాణి దంపతులు శ్రీలక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం 11న

ఉంగుటూరు : మండలంలోని లంకపల్లి అగ్రహారంలోని శ్రీదేవి, భూదేవి సహిత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవం ఈ నెల 11వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి అత్యంత వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ పెద్దలు గడ్డం వీరాస్వామి, అన్నం జ్వాలా నాగేశ్వరరావు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన పెండ్లిమండపంపై వేదపండితులు పరాశరం రామకృష్ణమాచార్య పాకయాజి, వారి శిష్యబృందం ఆధ్వర్యంలో స్వామివార్ల కళ్యాణ వేడుక(యాజ్ఞీకము)ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చదలవాడ కుమారస్వామి, శివనాగేశ్వరరావు నేతృత్వంలో ఉదయం 6గంటలనుంచి స్వామివార్లకు విశేష పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు.

బాబాకు గులాబీలతో అర్చన



ఉయ్యూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : వైశాఖ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని గండిగుంట అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణం షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం బాబాకు లక్ష గులాబీల అర్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హరినాథ్ బాబు, రాధారాణి, శ్రీశ్రీనివాస విద్యాసంస్థల ఛైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ ఆధ్వర్యంలో బాబావిగ్రహానికి గులాబీలు, చామంతులతో అర్చన, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సేవలందించారు. గండిగుంట, ఉయ్యూరు పరిసర గ్రామాలనుంచి భక్తులు తరలి వచ్చి పూజలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

ఉంగుటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై గ్రామాల్లో ప్రజలకు సరైన సమాచారం అందటంలేదని, వాటిపై అవగాహన కల్పించడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని సీపీఎం జిల్లా, మండల కార్యదర్శులు టీవీ లక్ష్మణస్వామి, అజ్మీర వెంకటేశ్వరరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్ యు.కిషోర్‌బాబుని కలిసి పథకాలపై ప్రజలకు క్షేత్రస్థాయిలో సమాచారం అందించేందుకు చేపట్టాల్సిన చర్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కే.రామరాజు, పి.శ్రీనివాసరావు, టీవీ రామ్మోహనరావు, వై.జగన్, డి.శ్రీనివాసరావు, ఎం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పరిశోధనా పత్రాలను చూపుతున్న ప్రతినిధులు

పీవీపీ సిద్ధార్థ కళాశాల్లో అంతర్జాతీయ సదస్సు

పెనమలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ మెకానికల్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్-2025 అనే అంశంపై గురువారం రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. పీవీపీ సిద్ధార్థ, వరంగల్ ఎన్ఐటీ సం యుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ఎస్ఏజీటీఈ స్పాన్సర్‌గా వ్యవరిస్తోందని కార్యక్రమం ప్రతినిధులు తెలిపారు. ఈ సదస్సుకు దేశవిదేశాల నుంచి వందకుపైగా పరిశోధనా పత్రాలు అందగా వాటిలో అరవై పత్రాలను ఎంపికచేశారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన పోలాండ్ ప్రొఫెసర్ మిచల్ పియాసెకి మాట్లాడుతూ, ఇలాంటి సదస్సుల ద్వారా జ్ఞాన మార్పిడికి అవకాశాలుంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ జీ రాఘవేంద్ర, ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు, బీ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం, మే 8 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్టు సీడీపీవో పి.వెంకటలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లాపురం-2 కార్యకర్త పోస్టుకు ఓసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ సహాయకుల పోస్టులకు సంబంధించి బీబీగూడెం-1 (బీసీ-ఎ), కొత్తపేట (బీసీ-డి), కాకులపాడు-1 (ఓసీ), కాకులపాడు-2 (ఎస్సీ), మల్లవల్లి-2 (బీసీ-ఎ), అల్లాపురం-1 (ఎస్సీ), అల్లాపురం-2 (ఓసీ) బుద్ధవరం-3 (బీసీ-డీ), దుర్గాపురం(ఓసీ), బూతిమిల్లిపాడు (ఎస్సీ), పొట్టిపాడు-2 (బీసీ-డీ) నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదీలోపు విద్యా, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జత చేసిన దరఖాస్తులను స్వయంగా గన్నవరంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సమర్పించాలని సీడీపీవో తెలిపారు.

సహాయకులకు దరఖాస్తు చేసుకోండి

ఉయ్యూరు : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాళ్ల పోస్టులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కేబీ సుకన్య తెలిపారు. 19, 20 వార్డులకు సంబంధించి ఇండియన్ బ్యాంక్ కేంద్రంలో ఓసీ, 5వ వార్డులో దళితవాడ- 3 కేంద్రంలో ఎస్సీ, 15వ వార్డు గిరిజన కాలనీలో ఎస్టీ మహిళలకు కేటాయించినట్టు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 17 సాయంత్రం లోపు కంకిపాడు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.



ఉపాధ్యాయురాలి తరపున విరాళం అందజేస్తున్న రమణగోపాల్

మానవత సేవాభివృద్ధికి రూ. 50వేల విరాళం

- అందజేసిన వీరవల్లి ఉపాధ్యాయురాలు పార్వతీదేవి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : అవసరాన్ని గమనించి ఆదుకోవడంతో పాటు విద్యాభివృద్ధికి సహకారం అందిస్తున్న మానవత సేవలను గుర్తించి తన వంతు సహకారంగా విరాళం అందజేసి వీరవల్లి హైస్కూల్ ఉపాధ్యాయురాలు పార్వతీదేవి సేవా తత్పరతను చాటారు. వీరవల్లి హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ మే నెలలో పదవీ విరమణ చేస్తున్న ఆబోతుల పార్వతీదేవి రూ. 50వేల విరాళాన్ని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావుకు గురువారం తోటి ఉపాధ్యాయుడు రమణ గోపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎ.వి. కృష్ణారావు, ఏలూరు కెనరా బ్యాంక్‌శాఖ మేనేజర్ కూనపురెడ్డి శ్రీనివాసరావు, గోవర్ధనరావు, మావనత అధ్యక్షుడు గూడపాటి జయరామచంద్రరావు, కార్యదర్శి పాటోలు గణేష్, సభ్యులు వేగిరెడ్డి సూర్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు, బాణాల నరసింహారావు, వడ్డి రాజేశ్వరరావు, పి.వి. ఎస్.చలం, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా గంగమ్మ సంబరాలు

ఉయ్యూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : కాటూరులో కొలుసు వారి గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభించారు. కుందేరురోడ్డులో అమ్మ వారి ఆలయం వద్ద గురువారం జరిగిన పూజా కార్యక్రమంలో కొలుసు వంశస్తులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొలుసు విజయలక్ష్మి, పోతురాజు తదితరులు లాంచనంగా పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. ఈ నెల 11వరకు జరిగే గంగమ్మ సంబరాలకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఎంపీ బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారు.



గ్రామాల అభివృద్ధి కూటమితోనే సాధ్యం : ఎమ్మెల్యే

పెదపారుపూడి, మే 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. గురువారం వింజనంపాడు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి); మాజీ ఎంపీపీ పెద్దిబోయిన గోపాలస్వామి, మాజీ జెడ్పీటీసీ చిలకా ఆంజనేయులు, కొమ్మ నారాయణ, మగదొడ్డి శ్రీనివారావు, కొమ్మ లక్ష్మణరావు, కూచిపూడి సుబ్బయ్య, గొరిపర్తి రవికుమార్, గోగం రామారావు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కుమార్ రాజా

పాక్షిక మంచినీటి సరఫరా నేడు

గుడివాడ, మే 8(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9వ తేదీ శుక్రవారం పట్టణ ప్రజలకు పాక్షికంగా మంచినీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో గురువారం కురిసిన అకాల వర్షం కారణంగా హెడ్ వాటర్ వర్క్స్ సప్లైకు అంతరాయం కలిగింది. ప్రజలకు మంచినీటి సరఫరా చేయడానికి రిజర్వాయర్‌లలో పూర్తిస్థాయిలో నీటిని నింపడానికి వీలుపడదన్నారు. ప్రజలు సహకరించాలని కమిషనర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుడివాడ : అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని కింద పడిన ద్విచక్రవాహనదారుడి కుడి చేతిపై బస్సు ఎక్కడంతో తీవ్రగాయమైంది. ద్రోణాదుల వారి వీధికి చెందిన పట్టపు సాయిసుభాష్ నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ క్రమంలో వెనుక వస్తున్న ఆర్టీసీ బస్సు టైరు సుభాష్ కుడిచేతిపైకి ఎక్కడంతో తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం సుభాష్‌ను ప్రాంతీయ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ ఎస్సై జాస్మిన్ తెలిపారు.

వంతెన శిథిలం .. ప్రయాణించాలంటే భయం

● ప్రమాద స్థితిలో రైవస్ కాల్వ వంతెన ● ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలో ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి - పమిడిముక్కల) : మర్రివాడ వద్ద రైవస్‌కాల్వపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెనపై స్లాబు సైతం ధ్వంసమైంది. సుమారు ఆరుదశాబ్దాల క్రితం రైవస్‌కాల్వపై నిర్మించిన వంతెన ఎప్పుడు కూలుతుందో తెలియని ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. దీంతో వాహనదారులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఈ వంతెనపై రాకపోలకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. దీనికితోడు వంతెనపై అక్కడక్కడా భారీ స్థాయిలో గోతులు ఏర్పడ్డాయి. వంతెన ప్రమాదస్థితిని తెలియచేస్తూ స్థానికులు గొయ్యిలో కొబ్బరిబోదెలు ఉంచారు. స్లాబు కుంగి బీటలు వారిన చోట కొబ్బరి బోదెలు అడ్డంగా ఉంచి హెచ్చరికగా ఎర్రరంగు గుడ్డ కట్టారు. ఆయా గ్రామాల్లో పండించిన వ్యవసాయ ఉత్పత్తులను రైతులు ఈ వంతెనపై నుంచే రవాణా సాగిస్తున్నారు. వంతెన ప్రమాదకర పరిస్థితిని ఎమ్మెల్యే ఇటీవల పరిశీలించి అధికారులతో మాట్లాడి త్వరగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదకర వంతెన స్థితిపై ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులను వివరణ కోరగా ఆ వంతెన తమదికాదు జిల్లా పరిషత్ రోడ్డులో ఉందని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. కాల్వవరకే తమదని వంతెన ఎప్పుడు ఏప్రభుత్వ శాఖ నిర్మించారో తెలియదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.



శిథిలావస్థకు చేరిన వంతెన



స్లాబు కుంగిపోకుండా అడ్డుపెట్టిన కొబ్బరి బోదెలు

ప్రమాదం పొంచి ఉంది

వంతెన ప్రమాదకరంగా ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వంతెన కూలితే పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడక తప్పదు. ప్రమాదం జరుగకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

వై. రాజేంద్రప్రసాద్, మర్రివాడ

బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నాం

కుంగి. గోతులు పడిన వంతెనపై బిక్కు బిక్కుమని రాకపోకలు సాగిస్తున్నాము. ఎప్పుడు కూలుతుందో అనే భయంతో గడుపుతున్నాం. ఈ వంతెనపై బస్సులు, లారీలు వెళ్లేందుకు వీల్లేకుండా ఉంది.

శరత్, మర్రివాడ

నిధులు మంజూరు కాలేదు

ఎమ్మెల్యే సూచన మేరకు వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులను నాబార్డును కోరాం. నిధులు మంజూరైన వెంటనే వంతెన నిర్మాణాన్ని చేపడతాం

అరుణ్‌కుమార్ , ఇరిగేషన్ ఏఈ

కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుంది


పమిడిముక్కల, మే 8 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కార్యకర్తలకు టీడీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. తాడంకి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త అనపోజు వెంకటేశ్వరరావు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా అతని కుటుంబ సభ్యులకు పార్టీ ప్రమాదబీమాగా రూ. 5లక్షల ఇన్సూరెన్స్ చెక్కును గురువారం అందజేశారు. వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుని కుటుంబానికి పార్టీ అండదండగా నిలుస్తుందన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు జక్కాశ్రీనివాసరావు, జనసేన పార్టీనాయకుడు తాడిశెట్టి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేల కొరిగిన తాటిచెట్టుతో తప్పని తిప్పలు

కూచిపూడి: గురువారం మధ్యాహ్నం గాలులతో కూడిన వర్షానికి చిన ముత్తేవిలో తాటిచెట్టు నేలకొరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదే సందర్భంలో చెట్టు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఆ సమయంలో ప్రజల రాకపోకలు లేని కారణంగా పెద్ద ప్రమాదం తప్పింది. చెట్టును యంత్రాల సహాయంతో ముక్కలు చేసి తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ మరమ్మతులు చేపట్టారు.

రొయ్యూరులో ఒకరిపై దాడి

తోట్లవల్లూరు : రొయ్యూరులో గురువారం లుక్కా వెంకటేశ్వరరావు(65) అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేశారు. లుక్కా వెంకటేశ్వరరావు లుక్కా సత్యనారాయణ నుంచి రూ. 30 వేలు అప్పు తీసుకున్నాడు. ఈ అప్పు అడిగే విషయంలో గురువారం తలెత్తిన వివాదంలో వెంకటేశ్వరరావుపై దాడి జరిగింది. సత్యనారాయణ, ధనుంజయ్, హర్షవర్ధన్, కుమార్ అనే వ్యక్తులు దాడిచేసి గాయపర్చారని వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశాడని ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు. బాధితుడిని ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.





ఎన్నికల హామీ నెరవేర్చాలని ధర్నా

గుడివాడ, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన టిడ్కో లబ్ధిదారుల రుణవిముక్తి హామీని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నిలబెట్టుకోవాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో కమిటీ అధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఉపాధ్యక్షులు శివరాంప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ జరుగు దేశవ్యాప్త కార్మికుల, ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో టిడ్కో కాలనీవాసులు భాగస్వామ్యులవుతారని తెలిపారు. ఉపాధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కాలనీలో మంచినీటి పైపులనుంచి నీరు వదలమని ఆదేశించిన, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కోట్లాది రూపాయల ఖర్చులో టిడ్కో గృహాలను నిర్మించి రూ.4కోట్ల వ్యయంతో కాలనీలోని 220 బ్లాక్‌లలో ఉప్పు నీటిబోరులు వేయడం మరిచారని విమర్శించారు. స్థానిక 33వ వార్డు పాటిమీదలో కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పాలకొల్లు నాగమణి, పుట్టి పద్మ, గుంట్రెడ్డి మల్లీశ్వరీ, సీతామహాలక్ష్మీ, గరికపాటి నాగమణి, శివకుమారి, షేక్ చాందిని, ఉమా, దేవి, చినమ్ములు, భారతి, పార్వతి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న టిడ్కోకాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

కాశీనాథుని సేవలు నేటితరానికి ఆదర్శం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, మే 8 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమానికి దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు అందించిన సేవలు నేటి తరానికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనపరిచిన ప్రముఖులకు కేడీబీ ట్రస్టు ఆధ్వర్యంలో ఎల్లకుర్రు విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ వారిచే విశ్వదాత అవార్డులను గురువారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాశీనాథుని వంశస్తులైన నాగేశ్వరరావు ఎలకుర్రులోని దివ్యాంగ చిన్నారులకు అందిస్తున్న సేవలు మార్గదర్శకమన్నారు. అనంతరం విశ్వధాత ఫౌండేషన్ అధ్యక్షుడు కాశీనాధుని నాగేశ్వరరావు అధ్యక్షతన వివిధ రంగాల్లో విశిష్టులైన కేంద్ర సాహిత్య అకాడమి అవార్డుగ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ విశాఖపట్నానికి చెందిన ప్రముఖ జర్నలిస్టు గంట్ల శ్రీనుబాబు, ప్రసారభారతి ప్రతినిధి ముదిగొండ రవిశంకర్, ప్రముఖ కూచిపూడి నాట్యచారుడు వేదాంతం పార్థసారథితోపాటు ఉపాధ్యాయులు, నాట్యకళాకారిణి శివలెంక ఉషాకిరణ్‌లకు విశ్వదాత అవార్డులను అందజేశారు. కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కూన రాంజీ , తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

గుడివాడ, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ అధ్యక్షకార్యదర్శులుగా ఎన్నికైన డాక్టర్ మాగంటి శ్రీనివాస్, డాక్టర్ పునుకొల్లు శ్రీనివాస్‌లు సామాజిక సేవతో పాటు వైద్య రంగంలోనూ ఉత్తమ సేవలందిస్తున్నారని ప్రముఖ వైద్యులు డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ కార్యాలయంలో వారాంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ మాగంటి, డాక్టర్ పునుకొల్లులను ఘనంగా సత్కరించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ ఉండవల్లి సురేష్, డాక్టర్ దేవరపల్లి సూరజ్, క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు టి.ఎన్ రాజశేఖర్, జి.కిరణ్‌బాబు, క్లబ్ కౌన్సిలర్లు జి.బాబుశ్రీకర్, డాక్టర్ పి.విశ్వేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు, పాల్గొన్నారు.

సృజనాత్మకతకు గ్రంథాలయాలు దోహదం

పామర్రు: వేసవి శిక్షణా తరగతులు పిల్లల్లో సృజనాత్మకత శక్తి పెంపొందింపజేస్తామని పామర్రు జిల్లా గ్రంథాలయ అధికారి ఎం ఝాన్సీరాణిఅన్నారు. గ్రంథాలయాల్లో పిల్లలకు నిర్వహిస్తున్న వేసవి తరగతుల్లో భాగంగా గురువారం చిన్నారులకు చిత్రలేఖనం ఖో ఖోగేమ్స్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.నాగసురేష్, పాల్గొన్నారు.

పిల్లల తగాదా నేపథ్యంలో ఒకరిపై దాడి

గుడివాడ : చిన్న పిల్లల తగాదా నేపథ్యంలో ఒకరిపై గాజు పెంకుతో దాడి చేసిన సంఘటన పట్టణంలోని రైలుపేటలో చోటుచేసుకుంది. గురువారం స్థానిక రైలుపేటలో చిన్న పిల్లల మధ్య చిన్న గొడవ ఏర్పడింది. ఈ నేపథ్యంలో గుమ్మా వెంకటేశ్వర్లు తగాదా విషయంలో పెద్దల మధ్య గొడవ వద్దని వారించబోయాడు. దాసరి వెంకటేశు, క్రీస్తురాజు, బంగారయ్య, రాణి, గంగా, దుర్గలు గుమ్మా వెంకటేశ్వర్లుతో గొడవకు దిగారు. క్రీస్తు రాజు అనే వ్యక్తి గాజుపెంకుతో వెంకటేశ్వర్లు కుడి డొక్కలో పొడవడంతో తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం వెంకటేశ్వర్లును స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ ఎఎస్సై ఈదర జయబాబు తెలిపారు.

క్షేత్రయ్య కళాశాల విద్యార్థులకు మెరిట్ అవార్డులు

కూచిపూడి, మే 8 (ఆంధ్రజ్యోతి): మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పలువురు మెరిట్ అవార్డులు అందుకున్నారు. విద్యార్థి వికాస వాహిని ట్రస్ట్ (కంకిపాడు) ఈ అవార్డును విజయవాడ రామ్మోహన్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. కళాశాల విద్యార్థులు మురళీధర్, మేఘన, భువనశ్రీ, లావణ్య, భానుమతి, జరిషా అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. వీవీ ట్రస్ట్ అధ్యక్షులు వేములపల్లి కేశవరావు ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి జి.వి.పూర్ణచంద్, మండలి వెంకట్రామ్ తదితరులు విద్యార్థులకు అవార్డులు అందజేశారు.



అవార్డులు అందుకుంటున్న క్షేత్రయ్య కళాశాల విద్యార్థులు

అగ్ని ప్రమాద బాధితులకు వంట సామగ్రి



అగ్నిబాధిత కుటుంబాలకు వంటపాత్రలు అందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కూచిపూడి, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ మొవ్వ మండల శాఖ కూచిపూడిలో పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు సర్ హెన్రీ జ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద బాధితులు పలువురికి వంట పాత్రలు, టార్పాలిన్లు తదితరాలను అందజేశారు. ఈ సందర్భంగా చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, సిలికా నాంధ్ర ఏవో హనుమంత కుమార్, తహసీల్దార్ మస్తాన్, రెడ్‌క్రాస్ మండల చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సభ్యులు కామేశ్వరరావు, డివివి.నాగేశ్వరరావు, రామాంజనేయులు, గొరిపర్తి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవం

గుడివాడ, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా స్థానిక జనసేన కార్యాలయంలో విజయోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచి ఆర్మీ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర విజయవంతమవ్వడం దేశప్రజలకు ఎంతో ఆనందానిచ్చిందని, ధైర్యాన్ని నింపిందన్నారు. నాయకులు మజ్జి శ్రీనివాసరావు, ఆంజనేయులు, వెంకట్, గుండు వెంకట్రావు, షరీఫ్, కిరణ్, విశ్వేశ్వరరావు, కళ్యాణి, సౌమ్య, శిరీష పాల్గొన్నారు.



విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న జనసేన నాయకులు

ముఖమండప పునఃనిర్మాణానికి విరాళం

గుడివాడ, మే 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థాన ముఖమండప పునఃనిర్మాణానికి గురువారం దేవస్థానం ఉత్సవకమిటీ చైర్మన్ సాయన రాజేష్‌కు దాత డొగ్గ కృష్ణారావు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.10,116 లు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

16వ తేదీన శ్రీలక్ష్మీగణపతి హోమం

స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో వైశాక మాసం బహుళచవితి సంకటహర చతుర్థి పర్వదినం సందర్భంగా ఈ నెల 16వ తేదీన ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్టు కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు)గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజా ద్రవ్యములు దేవస్థానం వారే అందజేస్తారని ఈవో తెలిపారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

గుడివాడ, మే 8 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) కోరారు. గురువారం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాస్పత్రిలో పట్టణానికి చెందిన గంధం సరళ అనే మహిళకు శస్త్రచికిత్స నిమిత్తం రక్తం అవసరమవ్వడంతో ఆర్‌కె వారియర్స్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గాదె చరణ్, లంకా రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం అవరణలో తారకరామా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో రక్తదాన అవశ్యకతను వివరిస్తూ ప్లేకార్డుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సీతారామస్వామి, శైలజ, కేశవరావు, మల్లిక్, మోహనరావు, ఉమామహేశ్వరరావు, బాస్కర్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసరావు, గంగాధరరావు, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.



పామర్రు-చల్లపల్లి ప్రధాన రహదారిపై వరదలా ప్రవహిస్తున్న మురుగునీరు



కూచిపూడిలో పిడుగు పడి కాలిపోయిన తాటి చెట్టు

అకాల వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

గుడివాడ, మే 8(ఆంధ్రజ్యోతి) : గుడివాడలో గురువారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులతో వర్షం కురిసింది. దాదాపుగా రెండుగంటల పాటు ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. లోతట్టు, శివారు ప్రాంతాలు రహదారులపై స్వల్పంగా నీరు నిలిచింది. టిడ్కో, జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది, విద్యుత్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి విద్యుత్ సరఫరాలను పునరుద్ధరించారు.

పామర్రు: పామర్రులో గురువారం కురిసిన అకాల వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 2గంటలకు ఉరుములు,మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దాదాపు 45 నిముషాల పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి పలు రోడ్లు జలమయమయ్యాయి. పామర్రు-చల్లపల్లి ప్రధాన రహదారిపై నాగులేటి వంతెన ఎగువప్రాంతమైన సుభద్ర కల్యాణమందిరం సమీపంలో పంచాయతీ మురుగు డ్రెయినేజీ ప్రవహించడంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సమాచారం అందుకున్న పంచాయతీ శానిటరి అధికారి సుధాకర్ తన సిబ్బందితో చల్లపల్లి రహదారి డ్రెయినేజీ లైన్లకు ఉన్న అడ్డంకులను తొలగించి, మురుగునీటి సరఫరాను పునరుద్ధరించారు. జగనన్న ఎస్సీకాలనీ జల దిగ్బంధంలో చిక్కుకుంది. కాలనీలో రాత్రి సమయంలో దోమల బెడదతో కునుకులేకుండా కాలం వెల్లదీయాల్సి వస్తొందని కాలనీ వాసులు వాపోయారు.

కూచిపూడి: కూచిపూడిలో గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా వాతావరణం మారి పిడుగులతో కూడిన వర్షం పడింది. ఆ సమయంలో కూచిపూడిలోని డాక్టర్ గొట్టిపాటి రామకృష్ణారావు హాస్పటల్ ఎదురుగా గల తాటిచెట్టుపై పిడుగు పడి కాలిపోయింది. ఈ సందర్భంగా చెట్టు విరిగి విద్యుత్ లైన్లపై పడగా, స్తంభాలు విరిగి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ ఏఈ రమేష్ పర్యవేక్షణలో సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ చేశారు.

ఘనంగా టీడీపీ నేత జన్మదినోత్సవం

పమిడిముక్కల, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ టీడీపీ నాయకుడు తాతినేని రమేశ్ జన్మదిన వేడుక కపిలేశ్వరపురంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాతినేని సాయిదత్ ఆధ్వర్యంలో పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానుల నడుమ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు తోట్లవల్లూరుమండల పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్, లయన్స్‌క్లబ్ సెక్రటరీ తుమ్మల వెంకట గంగాధరరావు , పార్టీ నాయకులు లింగమనేని బాబూ రావు, మైనేని నరేంద్ర, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు. అన్న సమారాధన చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

బంటుమిల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హత ఉన్నవారు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులను స్వయంగా అందజేయాలని ప్రాజెక్టు అధికారిణి సముద్రవేణి తెలిపారు. అర్తమూరు-1 ఆయా(ఓసీ), చినతుమ్మిడి ఆయా(బీసీ-డీ) కృత్తివెన్ను హరిజనవాడ అంగన్వాడీ కార్యకర్త(ఎస్సీ), లక్ష్మీపురం లాకు, చినపల్లెపాలెం, మాట్లం ఎస్.నగర్‌లో ఆయా పోస్టులు (ఓసీ)కి కేటాయించారని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, జూలై 1 నాటికి 21 ఏళ్ల నిండి 35 ఏళ్ల లోపు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ పత్రం జతపరచాలని, ఆధార్, రేషన్‌కార్డు జిరాక్సులు, పాస్‌పోర్టుసైజు ఫోటో, గెజిటెడ్ అధికారి సంతకాలతో రెండుసెట్లు ఇవ్వాలని సూచించారు.

పట్టణంలో సీవేజ్ ప్లాంట్లు నిర్మిస్తాం

● స్థల సేకరణకు యజమానులను ఒప్పిస్తున్నాం: ఆర్డీవో స్వాతి



స్థల యజమానులతో మాట్లాడుతున్న ఆర్డీవో స్వాతి

పెడన, మే 8 (ఆంధ్రజ్యోతి): 'మురుగునీటిని మంచినీటిగా మార్చేందుకు పట్టణంలో రెండు సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, ఒక నేచురల్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మిస్తాం. ఈ మూడు ప్లాంట్ల నిర్మాణానికి 1.77 ఎకరాలు అవసరం. 96 సెంట్లు ఇచ్చేందుకు కొందరు రైతులు అంగీకారం తెలిపారు. మిగిలిన 80 సెంట్లు ఇచ్చేందుకు స్థల యజమానులు ముందుకు రావడం లేదు. వీరిని కూడా ఒప్పిస్తాం' అని ఆర్డీవో కె.స్వాతి తెలిపారు. సీవేజ్ ప్లాంట్ల నిర్మాణం కోసం స్థలం సేకరించేందుకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో స్థల యజమానులతో ఆమె సమావేశమయ్యారు. ప్రభుత్వం ఎకరాకు రూ.1.12 కోట్లు ఇస్తుందని, అవసరమైతే దీనికి రెట్టింపు ధర ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉందని తెలిపారు. మంచి ధర వస్తున్నందున భూములు ఇవ్వాలని, నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. తమకు రూ.3.50 కోట్లు కావాలని స్థల యజమానులు అడగడంతో ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని ఆర్డీవో తెలిపారు. తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, కమిషనర్ ఎం.గోపాలరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

పెడన, మే 8 (ఆంధ్రజ్యోతి): 17వ వార్డులో చేనేత కుటుంబానికి చెందిన నిరుపేద పాలిటెక్నిక్ విద్యార్థిని ఉమ్మిటి హారిక చదువు కొనసాగించేందుకు 'మేమున్నాం' సేవా సంస్థ రూ.33 వేలు అందించింది. దాతల సహకారంతో సేకరించిన మొత్తాన్ని ఆర్డీవో స్వాతి చేతుల మీదుగా గురువారం హారికకు అందజేసింది. తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, కమిషనర్ ఎం.గోపాలరావు, టీపీవో సుజనకుమారి, మేమున్నాం సేవా సంస్థ చైర్మన్ వీణం శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

నగదు బహుమతి అందజేత

ఘంటసాల, మే 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 565 మార్కులు సాధించి మండలంలో మూడో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం గ్రామానికి చెందిన కోడి సౌమ్యశ్రీని ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ అభినందించి సత్కరించారు. విద్యార్థి ఉన్నత చదువు కోసం టీడీపీ నాయకులు తుమ్మల చౌదరిబాబు, తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా) అందించిన రూ.5 వేల ప్రోత్సాహక నగదు బహుమతిని వెంకట్రామ్ అందజేశారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ పాల్గొన్నారు.

సైనికులకు సంఘీభావం

'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా ర్యాలీలు



అవనిగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నేతలు

మచిలీపట్నం/అవనిగడ్డ, మే 8(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా సైనికులకు సంఘీభావం తెలుపుతూ గురువారం పోతేపల్లి జ్యుయలరీ పార్కులో, అవనిగడ్డలో భారీ ర్యాలీలు నిర్వహించారు. పోతేపల్లి జ్యుయలరీ పార్కులో నిర్వహించిన సంఘీభావ ర్యాలీలో పార్కు ఎండీ చలమలశెట్టి ప్రసాదరావు, ప్రెసిడెంట్ పెద్దేటి వెంకటసుబ్బారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా, యూనిట్ యజమానులు, కార్మికులు పాల్గొన్నారు. అవనిగడ్డలో కోడూరు రోడ్డులోని పెట్రోల్ బంక్ నుంచి ఆర్యవైశ్య కల్యాణ మండపం వరకు కూటమి నేతలు భారీ ర్యాలీ చేశారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ పాల్గొన్నారు.



తాళ్లపాలెంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, పోలీసులు

అప్రమత్తంగా ఉండండి



నాచుగుంటలో పర్యటిస్తున్న పోలీసులు

నాగాయలంక: మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామాలైన నాచుగుంట, ఈలచెట్లదిబ్బ, ఎదురుమొండి గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని పాలకాయితిప్ప మెరైన్ పోలీసులు సూచించారు. రెండు డ్రోన్ కెమెరాలతో మెరైన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పహారా కాశారు. అనంతరం గ్రామస్థులకు పాక్ ఉగ్రవాదుల దాడులపై అవగాహన కల్పించారు.

తాళ్లపాలెం హైస్కూల్‌లో మాక్‌డ్రిల్

మచిలీపట్నం టౌన్: కృష్ణా యూనివర్సిటీ ఎన్‌సీసీ క్యాడెట్లతో బందరు మండలం తాళ్లపాలెం హైస్కూల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. యుద్ధ, జాతీయ సాయి అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాథమిక రక్షణ చర్యలు, సురక్షిత ప్రాంతాలకు తరలింపు, సహాయక చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామస్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



టీడీపీ మండల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

అవనిగడ్డ, మే 8(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, అంతకుముందే కుటుంబ సాధికార సభ్యుల నియామకం, సంస్థాగత ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసుకుని ప్రతీ ఒక్కరూ కుటుంబ సాధికార సభ్యులుగా నమోదు కావాలని ఆయన సూచించారు. నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యకర్తల బలంతో తెలుగుజాతి ఉన్నంత వరకు టీడీపీ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో జిల్లా మినీ మహానాడు నిర్వహిస్తే ఎమ్మెల్యే లేని లోటు తీర్చి కార్యకర్తల్లో ఉత్సాహం నింపొచ్చని పారిశ్రామికవేత్త, టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ సూచించారు. అవనిగడ్డలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని మైనార్టీ నేత షేక్ బాబావలి కోరగా, అందుకు ఆర్టీసీ చైర్మన్ సుముఖత వ్యక్తం చేశారు. స్థలాన్ని ఎంపిక చేయాలని సూచించారు. యాసం చిట్టిబాబు, కర్రా సుధాకర్, కొల్లూరి వెంకటేశ్వరరావు, తలశిల స్వర్ణలత, మాచవరపు ఆదినారాయణ పాల్గొన్నారు.

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న డీఆర్వో చంద్రశేఖర్

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని మచిలీపట్నం, అవనిగడ్డలో గురువారం ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం గాంధీ నగర్ వాకర్స్ భవనంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి నివాళులర్పించారు. డాక్టర్ పట్టాభి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ఆవరణలో హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి డీఆర్వో కె.చంద్రశేఖర్ నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు. అవనిగడ్డ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. 2005లో రెడ్‌క్రాస్ సొసైటీ జీవిత కాల సభ్యుడిగా చేరి నిరంతరాయంగా సేవలందిస్తున్న ఆది రామ్మోహనరావును సత్కరించారు. రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ వంగర శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

గూడూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లోని టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు, డీసీ చైర్మన్ పోతన స్వామి, జనసేన, బీజేపీ నాయకులు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కృత్తివెన్ను, మే 8(ఆంధ్రజ్యోతి): చినగొల్లపాలెం గ్రామంలో జరుగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. స్వామికి పట్టువస్త్రాలను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసీరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సాధనాల బాబ్జీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఘంటసాల, మే 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితుడికి టీడీపీ నేతలు గురువారం ఆర్థిక సాయమందించారు. చిన్నాపురం గ్రామానికి చెందిన వాసు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. నిరుపేద అయిన వాసు ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఘంటసాల మండలానికి చెందిన టీడీపీ నేతలు తుమ్మల చౌదరిబాబు, తాడికొండ వెంకటేశ్వరరావు(చిన్నా) రూ.12 వేలు ఆర్థిక సాయాన్ని కూటమి నేతల చేతులమీదుగా పంపిణీ చేశారు. నాయకులు దాసం రామకృష్ణ, తాడికొండ జితేంద్రకుమార్, ఉపసర్పంచ్ శీలం శ్రీనివాసరావు, ఆత్మూరి సీతారామరాజు, కొండవీటి నాని, కొండవీటి కోటి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

బంటుమిల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): పెందుర్రు గ్రామానికి చెందిన వృద్ధురాలు చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. 'గ్రామానికి చెందిన పాలపర్తి విజయలక్ష్మి(70)కి ముగ్గురు కుమార్తెలు, వారికి వివాహాలయ్యాయి. భర్త చనిపోయాడు. ముగ్గురు కూతుళ్ల వద్ద ఉంటూ పింఛన్ తీసుకునేందుకు ప్రతి నెలా పెందుర్రు వస్తోంది. ఎప్పటిలాగానే ఈనెల కూడా పెందుర్రు వచ్చి పింఛన్ తీసుకుంది. తాను ఎవరికీ భారం కాకూడదని, తన చావుకు ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్ రాసి చెరువు గట్టుపై పెట్టి రజకుల చెరువులో దిగి ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం గ్రామస్థులు చెరువు గట్టువైపు వెళ్లగా శవమై తేలుతోంది. చనిపోవడానికి బలమైన కారణాలు తెలియలేదు.' అని పోలీసులు తెలిపారు. పోలీసులు శవాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెద్ద కుమార్తె నూకల అరుణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై గణేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతిక ఎకరాల గడ్డివామి దగ్ధం

పెడన, మే 8 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ అబ్దుల్ ఖయ్యూంకు చెందిన పాతిక ఎకరాల గడ్డివామి గురువారం తెల్లవారుజామున దగ్ధమైంది. 4వ వార్డుకు చెందిన ఖయ్యూం పశువుల మేత కోసం తన ఇంటి సమీపంలో గడ్డివామి పెట్టుకున్నారు. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గడ్డివామి నుంచి మంటలు చెలరేగడంతో మొత్తం అగ్నికి ఆహుతయింది. మచిలీపట్నం నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

టీడీపీ 49వ డివిజన్ నూతన కమిటీ



నూతన కమిటీతో టీడీపీ నాయకులు గనిపిశెట్టి గోపాల్, పల్లపాటి సుబ్రహ్మణ్యం

మచిలీపట్నం టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): టీడీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం ఈడేపల్లిలో 49వ డివిజన్ ఇన్‌చార్జి గనిపిశెట్టి గోపాల్ ఆధ్వర్యంలో పార్టీ డివిజన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. అధ్యక్షుడుగా విన్నకోట ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా పడమట సురేష్‌బాబు, కోశాధికారిగా శ్రవణం సుందరబాబు ఎన్నికయ్యారు. తలారి రాంబాబు, పి.వి.ఫణికుమార్, మాదిరెడ్డి శ్రీను, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సాల్ట్ ఫ్యాక్టరీకి అనుమతివ్వాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

మచిలీపట్నం టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): 'పల్లెతుమ్మలపాలెంలో పాతికేళ్ల నుంచి నడుస్తున్న భారత్ సాల్ట్ ఫ్యాక్టరీని గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. సాల్ట్ ఫ్యాక్టరీ లీజుకు అనుమతులిచ్చి, ఫ్యాక్టరీ నిర్వహించేలా చూడాలి.' అని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. గురువారం మచిలీపట్నంలో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీ మూతపడడం వల్ల చుట్టుపక్కల గ్రామాల్లోని రెండువేల కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా సాల్ట్ ఫ్యాక్టరీ భూముల లీజు సంగతి తేల్చకపోవడంతో వారి ఉపాధి అగమ్యగోచరంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం సాల్ట్ ఫ్యాక్టరీకి అనుమతిచ్చి ఈ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాల్ని కాపాడాలన్నారు. సీపీఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా కన్యకా పరమేశ్వరి



మచిలీపట్నం టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి జయంతి సందర్భంగా గురువారం అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థాన కార్యదర్శి మోటమర్రి బాబాప్రసాద్, సామా లక్ష్మీకాంతారావు, బైసాని హయగ్రీవరావు, మహిళా భక్త సంఘం పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

కోడూరు, మే 8(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకల్లో భాగంగా అమ్మవారి గ్రామోత్సవాన్ని గురువారం కోడూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. బూరగడ్డ హరినాథ్‌బాబు, మద్దాలి ప్రసాద్, అన్నం శ్రీనివాస్, జూహూడి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

ఐనంపూడి డ్రెయిన్‌లో పనుల పరిశీలన

ఘంటసాల, మే 8(ఆంధ్రజ్యోతి): ఐనంపూడి డ్రెయిన్‌లో గుర్రపు డెక్క తొలగింపు పనులు, పలు అభివృద్ధి పనులను డ్రెయినేజీ శాఖ ఈఈ కిరణ్‌బాబు గురువారం పరిశీలించారు. మల్లాయి చిట్టూరు శివారులోని కాజ వంతెన దగ్గర ఐనంపూడి డ్రెయిన్‌పై జరుగుతున్న పనులను పరిశీలించి జేఈ భగవతితో చర్చించారు. గతంలో వరదలు వచ్చిన సమయంలో కాజ వంతెన ఎక్కే ప్రాంతంలో కోతకు గురికాగా, డ్రెయినేజీ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నట్లు ఈఈ వివరించారు. వర్షాకాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డ్రెయినేజీ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టడం పట్ల మల్లాయిచిట్టూరు నీటి సంఘం అధ్యక్షుడు ఆవుల ధర్మవెంకట నరసయ్య ఈఈకి కృతజ్ఞతలు తెలిపారు.

11న ఉచిత కంటి వైద్య శిబిరం

నాగాయలంక, మే 8 (ఆంధ్రజ్యోతి): మారుతీ విద్యానికేతన్ డిజిటల్ ఏసీ స్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటలకు 52వ ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు. పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సహకారంతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కంటి పరీక్షలు, శుక్లాలు ఉన్నవారికి శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తారని తెలిపారు.

జనసేన దక్షిణ చిరువోలులంక గ్రామ అధ్యక్షుడికి పరామర్శ

అవనిగడ్డ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న జనసేన దక్షిణ చిరువోలులంక గ్రామ అధ్యక్షుడు బచ్చు మురళీకృష్ణను ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను, నీటి సంఘం అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, చందన నరసింహారావు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు

మోపిదేవి, మే 8(ఆంధ్రజ్యోతి): కె.కొత్తపాలెంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జె.ప్రవీణ తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం స్వామిని పెండ్లి కుమారుడిని చేయుడం, 11న రాత్రి 8 గంటలకు స్వామి కల్యాణ మహోత్సవం, 12న సాయంత్రం 7 గంటలకు స్వామి రథోత్సవం, 13న మహాపూర్ణాహుతి, వసంతోత్సవం, పవళింపు సేవ కార్యక్రమాలతో మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

భావన్నారాయణస్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం



నాగాయలంక, మే 8(ఆంధ్రజ్యోతి): భావదేవరపల్లిలో శ్రీదేవి, భూదేవి, రాజ్యలక్ష్మి సమేత భావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 13 వరకు జరుగుతాయి. మొదటి రోజున స్వామి, అమ్మవార్లను వధూవరులను చేసే కార్యక్రమాలను ఆలయ అర్చకుడు పంచాంగం రమణాచార్యులు, శ్రీనివాసరావులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో సీహెచ్ సుధాకర్‌రావు, ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, గ్రామ పెద్దలు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఘనంగా ప్రసన్న గణపతి దేవాలయ వార్షికోత్సవం



కోడూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కోడూరు గొల్లపాలెం రోడ్డు నందు గల బుద్ధి, సిద్ధి ప్రసన్న గణపతి దేవాలయ సప్తమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు కాశీభట్ల శ్రీరామ్‌ప్రసాద్ స్వామి మూలవిరాట్‌కు నవవిధ అభిషేకములు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 5,000 మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి

అవనిగడ్డ, మే 8(ఆంధ్రజ్యోతి): భూ నీలా సమేత లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 16వరకు శ్రీ వైఖానసాగమ శాస్త్ర ప్రకారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరావు, ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు పాల్గొంటారని, పోతరాజు పవన్‌కుమార్-సుమిత్రి దంపతులు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. 10న స్వామిని పెండ్లి కుమారుని చేయుట, విష్ణు సహస్ర నామ పారాయణం, విష్వక్సేన ఆరాధన, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 11న శ్రీనృసింహ జయంతి, శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రాత్రికి జగజ్యోతి, ఎదుర్కోలు, కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 12న నిత్యహోమం, బలిహరణం, విశేష హోమాలు, 13న స్వామికి చక్రస్నానం, ధ్వజ అవరోహణం, మహదాశీర్వచనం జరుగుతాయి. 14న సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, శయనోత్సవంతో కార్యక్రమాలు సమాప్తమవుతాయని తెలిపారు.

వైభవంగా సత్యదేవుని వ్రతాలు

లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ఆవరణంలోని ఆస్థాన మండపంలో వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి. 15 మంది దంపతులు వ్రతాల్లో పాల్గొనగా, అర్చకస్వామి దీవి నరసింహమూర్తి వ్రతాలు నిర్వహించారు. ధర్మకర్త పోతరాజు భాస్కరరావు దంపతులు వ్రతాల్లో పాల్గొన్న వారికి ఉచితంగా పూజా సామగ్రిని అందించారు. అనంతరం వ్రత ప్రాముఖ్యతను కథల రూపంలో వివరించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

కొల్లూరి చిన్నాకు జ్ఞాని జైల్‌సింగ్ అవార్డు



పెడన, మే 8 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్ అవార్డుకు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా ఎంపికయ్యారు. నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్నందుకు గాను ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్(ఏపీజేయూ) ఈ అవార్డుకు ఎంపిక చేసింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 11వ తేదీన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఏపీజేయూ ప్రతినిధుల నుంచి చిన్నా ఈ అవార్డును అందుకుంటారు.

రేషన్‌కార్డుల నమోదు ప్రక్రియ పరిశీలన

మచిలీపట్నం టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): 45వ డివిజన్‌లో రేషన్ కార్డుల నమోదు ప్రక్రియను టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి పీవీ ఫణికుమార్ పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో కార్డులు ఆన్‌లైన్ చేయించారు. వీఆర్వో రమాదేవి, వెల్ఫేర్ సెక్రటరీ రామాంజనేయులు పాల్గొన్నారు.